విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 4, జులై 2024

## రైతు బజార్ ఏర్పాటు చేయండి

**విశాలాంధ్ర-తాడిపత్రి:** స్థానిక వ్యవసాయ కార్యాలయం వద్ద బుధవారము రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరాముడు యాదవ్, సిపిఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి యాదవ్ ఆధ్వర్యంలో పట్టణంలో రైతు బజార్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ అసిస్టెంట్ ఏవోకు వినతి పత్రం అంద జేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాడిపత్రి మండలం చుట్టూ దాదాపు 26 పంచాయతీ గ్రామాలు ఉన్నాయి. ఆ గ్రామాలలో రైతులు ఎంతో శ్రమించి కూరగాయ పంటలు పండిస్తున్నారు. పండించిన కూరగాయలను కూరగాయల మార్కెట్ కు తెస్తే కూరగాయల వ్యాపారస్తులు రైతుల వద్ద నుండి తక్కువ రేటుకు కొనుగోలు చేసి ప్రజలకు ఎక్కువ రేటుకు అమ్ముకుంటున్నార న్నారు. దీంతో ఇటు రైతు, సామాన్య ప్రజలు నష్టపోతున్నారు. మధ్య దళారీలు అధిక రేట్లకు అమ్ముకొని బాగుపడుతున్నారని, నూతన ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే రైతులను, సామాన్య ప్రజలను దృష్టిలో ఉంచుకొని తాడిపత్రి ప్రాంతంలో రైతు బజారును ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో రైతులను, ప్రజలను కలుపుకొని పోరాటాలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు శ్రీనివాస్ యాదవ్, రమణ, ఉమా గౌడ్ రత్నమయ్య, రామాంజనేయులు, రామాంజనేయ యాదవ్ పాల్గొన్నారు.

## వెల్ఫేర్ అసిస్టెంట్‌పై కలెక్టర్ సస్పెన్షన్ వేటు..

-కలెక్టర్ ఆదేశాలను అమలుపరిచిన ఎంపీడీవో

-పెన్షన్ సొమ్ము రూ.5.45 లక్షలను దుర్వినియోగం చేసినట్లు నిర్ధారణ

**విశాలాంధ్ర-శెట్టూరు:** శెట్టూరు గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న వెల్ఫేర్, ఎడ్యుకేషనల్ అసిస్టెంట్ అధికారి ఎస్, మల్లి కార్జునపై సస్పెన్షన్ వేటుపడింది. ఇతను మంగళవారం అవ్వ తాతల పెన్షన్ మొత్తం రూ.5.45లక్షల పింఛన్ లబ్ధిదారులకు ఇవ్వకుండా తన వ్యక్తిగత అవసరాలకు వినియోగించుకుని దుర్వినియోగం చేశాడు. ఈమేరకు కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశాలు మేరకు వెల్ఫేర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఆదేశాలను తక్షణమే అమలు అగునని తెలియజేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకున్నామని స్థానిక ఎంపీడీవో నరసింహా మూర్తి బుధవారం విలేకరులకు ఆయన ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు.

## కేసులను సకాలంలో పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి

**విశాలాంధ్ర-అనంతపురం:** కంటెంప్ట్ కేసులను సకాలంలో పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ వివిధ శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. బుధవారం అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో కంటెంప్ట్ కేసులపై వివిధ శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కంటెంప్ట్ కేసులు కోర్టులో నమోదైన వెంటనే చొరవ తీసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవా లన్నారు. కోర్టు కేసులు కంటెంప్ట్ వరకు పోకూడదని, ముందుగానే వాటి పరిష్కారానికి దృష్టి సారించా లని, ఒకవేళ కోర్టు కేసులు కంటెంప్ట్ వరకు వచ్చినా వెంటనే దానిని పరిష్కరించి వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. పెండింగ్ ఉంచుకోరాదని, సకాలంలో పరిష్కా రానికి చొరవ చూపాలన్నారు. జేసీ కేతన్ గార్గ్, డిఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, సిపిఓ అశోక్ కుమార్ రెడ్డి, డిపిఓ ప్రభాకర్ రావు, ఆర్.అండ్.బి ఎస్ఈ ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

## మాజీ సైనికుల సంక్షేమానికి సత్వర చర్యలు..

### కలెక్టర్ డా. వినోద్ కుమార్

**విశాలాంధ్ర-అనంతపురం:** జిల్లాలో ఉన్న మాజీ సైనికులు, సైనిక వితంతువులు, సర్వింగ్ సోల్జర్స్ సంక్షేమం కోసం ప్రభుత్వం తరఫున సత్వర సేవలు అందించాలని, అలాగే మాజీ సైనికులు, వారి పిల్లల కోసం త్వరలో జాబ్ మేళా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా. వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం నాడు కలెక్టరేట్ మినీ మీటింగ్ హాల్లో జిల్లా కలెక్టర్ డా . వినోద్ కుమార్ అధ్యక్షతన దాదాపు ఐదారు సంవత్సరాల గ్యాప్ తర్వాత అనంతపురము జిల్లా సైనిక్ బోర్డ్ మీటింగ్ ను నిర్వహించారు. ఈ సమావేశంలో సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ ఆమోదించిన ఎజెండా పాయింట్స్ ను, జిల్లా సైనిక్ బోర్డు మీటింగ్ ముఖ్య ఉద్దేశాన్ని అనంతపురము , సత్యసాయి జిల్లాల సైనిక సంక్షేమ అధికారి మరియు జిల్లా సైనిక్ బోర్డు కార్యదర్శి పి. తిమ్మప్ప బోర్డు చైర్మన్ అయిన జిల్లా కలెక్టర్ డా. వినోద్ కుమార్ కు, బోర్డు సభ్యులు మేఘా స్వరూప్, ఇతర సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. వినోద్ కుమార్ మాట్లాడుతూ దేశ సరిహద్దుల్లో మనందరి రక్షణ కోసం అహర్నిశలు కఠోర శ్రమతో సైనిక విధులు నిరవహిస్తూ పదవీ విరమణ చేసిన మాజీ సైనికులు, ప్రాణత్యాగం చేసిన వీర సైనికులపై ఆధార పడిన కుటుంబ సభ్యులు, సైనిక వితంతువుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం తరఫున అందిస్తున్న 5 ఎకరాల అస్సైన్డ్ భూముల కేటాయింపు, గన్ లైసెన్సుల జారీ, కేంద్రీయ సైనిక్ బోర్డ్, రాజ్య సైనిక్ బోర్డుల తరఫున, కేంద్ర రక్షణ శాఖ, ఆయా త్రివిధ దళాల రెజిమెంట్ల తరఫున అందిస్తున్న సంక్షేమ పథకాలు, వివిధ రకాల గ్రాంట్లు, పెన్షన్ , గుర్తింపు కార్డుల జారీ, ఆర్మీ క్యాంటీన్ కార్డులు, ఈసీహెచ్‌ఎస్ ఆరోగ్య సేవలు తదితర సంక్షేమ పథకాల లబ్ది, సేవలను జాప్యం లేకుండా సత్వరమే అందించాలని కలెక్టర్ ఆయా శాఖల అధికారులను మునిసిపల్ కమిషనర్ మేఘా స్వరూప్, ఇతర మునిసిపల్ కమిషనర్లను, డీపీఓను ఆదేశించారు.

## ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే...

**విశాలాంధ్ర-కళ్యాణదుర్గం టౌన్:** కరువుతో అల్లాడుతున్న ప్రాంతం కళ్యాణదుర్గం, అలాంటి ప్రాంతానికి ఎమ్మెల్యేగా ఎన్నికైన అమిలినేని సురేంద్రబాబు పేద విద్యార్థిని, విద్యార్థుల కోసం ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్ ను బుధవారం ప్రారంభించారు. ఈరోజు పేద విద్యార్థిని, విద్యార్థులు మంచి శుభ పరిణామం అని ఆశా భావం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి, పాలాభిషేకం చేసి వారి సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సురేంద్రబాబు మాట్లాడుతూ పేద ప్రాంతమైన కళ్యాణదుర్గం ప్రాంతానికి సేవ చేసే అదృష్టం రావడం చాలా సంతోషకరమన్నారు. కుల మతాలకు అతీతంగా సేవ చేస్తానన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేయాలనే దృఢ సంకల్పంతో ఉన్నానని, అందులో భాగంగా విద్యార్థిని విద్యార్థులకు క్రికెట్ లో రాణించదలచిన వారికి ఉచిత కోచింగ్, సామాగ్రిని త్వరలోనే అందించి ప్రారంభిస్తాం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ వైపి రమేష్, సీనియర్ నాయకులు మోరేపల్లి మల్లికార్జున, పాపం పల్లి రామాంజనేయులు, పట్టణ అధ్యక్షులు షేక్ శర్మాస్ వలి, ఉపాధ్యాయులు సంగప్ప, నరసింహ చారి, గౌని శ్రీనివాసరెడ్డి, తలారి నత్తి, బసవరాజు పాల్గొన్నారు.

## జీవో నెంబర్ 17ను మార్పు చేయండి

**విశాలాంధ్ర-కళ్యాణదుర్గం టౌన్:** అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు శకుంతలమ్మ, రమాదేవి బుధవారం పట్టణంలో ప్రజా వేదిక లో నిబంధనలతో కూడిన వినతి పత్రాన్ని ఎమ్మెల్యే సురేంద్ర బాబుకి అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో కుటుంబాలను పోషించు కుంటున్నామని జీవో నెంబర్ 17న మార్పు చేయాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలని, రాష్ట్రంలో ఉన్న మొత్తం మినీ సెంటర్ లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేయాలని, ప్రధానమంత్రి జీవిత బీమా అమలు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అంగన్వాడీలకు వర్తించేలా చూడాలని, చిన్నపిల్లలకు పంపిణీ చేసే సరుకులు నాణ్యమైన వాటిని ప్రభుత్వం సరఫరా చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు అచ్యుత్ ప్రసాద్ అంగన్వాడి వర్కర్లు తిప్పారమ్మ, రాధా, విజయనిర్మల, ద్రాక్షాయని సువర్ణ లక్ష్మి వరలక్ష్మి సుధామణి తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ కండువా కప్పుకున్న నలుగురు కౌన్సిలర్లు ...

**విశాలాంధ్ర-కళ్యాణదుర్గం టౌన్:** ఎమ్మెల్యే సురేంద్రబాబు ఆధ్వర్యంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌తో పాటు మరో ముగ్గు కౌన్సిలర్లు వైసీపీని వీడి టీడీపీ పార్టీ కండువా కప్పుకున్నారు. బుధవారం పట్టణంలోని ప్రజా వేదికలో మున్సిపల్ వైస్ చైర్మన్ తిమ్మప్ప, 13వ వార్డు కౌన్సిలర్ గంగమ్మ,17 కౌన్సిలర్ రాజేశ్వరి, 18 వ వార్డు కౌన్సిలర్ మహాలక్ష్మి, పార్టీని వీడారు. తెదేపా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఆ పార్టీలో చేరినట్లు చెప్పారు.

## ఖరీఫ్ పంటల సాగుపై శిక్షణ

**విశాలాంధ్ర-పెనుకొండ:** పెనుకొండ మండలంలోని వ్యవసాయ అధికారి కార్యాలయంలో బుధవారం ఖరీఫ్ పంటల సాగుకు సన్నద్ధం అవుతున్న రైతులకు పంటల సాగుపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఆర్సీ ఏడీఏ సనావుల్లా, డీఆర్సీ ఏఓ అబ్దుల్‌అలీ వరి, వేరుశనగ, సాగు విధానం, కలుపు, ఎరువుల యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. వరి సాగు చేసిన 15-18 రోజుల అనంతరం కలుపు మందు పిచికారి చేయాలని, వరి పంటను ఆశించే సుడిదోమ నివారణకు పెక్సిలాన్ 110 ఎం ఎల్ ఒక ఎకరం వరి పంటపై పిచికారీ చేయాలని సూచించారు. కందిలో ఎల్ ఆర్‌జీ-52 రకాన్ని ప్రభుత్వం సరఫరా చేస్తుందన్నారు. డ్రోన్ ద్వారా పురుగు మందువినియోగిస్తే ఖర్చు తగ్గటమేగాక నీరు ఆదా అవుతుందని తెలియజేశారు

## ఎంపీపీ తక్షణమే రాజీనామా చేయాలి

**విశాలాంధ్ర-బొమ్మనహాళ్:** బొమ్మనహాళ్ మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలు పద్మ తక్షణమే రాజీనామా చేయాలని బొమ్మనహాళ్ మండలంలోని పలువురు ఎంపీటీసీ సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం ఎల్బీనగర్ గ్రామంలో ఉప్పరహాళ్ ఎంపీటీసీ సభ్యురాలు ఎల్లంగి నాగమణి స్వగ్రామంలో అత్యవసర సమావేశం నిర్వహిం చారు. బొమ్మనహాళ్ ఎంపీటీసీ శివశరణమ్మ భర్త యువరాజు, ఉద్దేహాళ్ ఎంపీటీసీ సభ్యురాలు భర్త కోటేశ్వరరెడ్డి, కొళగానహళ్లి ఎంపీటీసీ తిమ్మప్ప, నేమకల్లు ఎంపీటీసీ చిక్కణ్ణ, బండూరు ఎంపీటీసీ అమరేష్, గోవిందవాడ, ఉంతకల్లు ఎంపీటీసీ సభ్యులు టీడీపీ నాయకుడు ముల్లంగి నారాయణస్వామితో సమావేశమై చర్చించారు. విలేకరులతో మాట్లాడుతూ ఎంపీపీ పద్మ తన పదవికి రాజీనామా చేసి బలనిరూపణ చేసుకోవాలని డిమాండ్ చేశారు.

## కీటక జనిత వ్యాధుల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన

**విశాలాంధ్ర-ఉరవకొండ :** అతిసార, కీటక జనిత వ్యాధుల నియంత్రణపై డాక్టర్ పివీ అనికేత్, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటరమణ ఆధ్వర్యంలో బుధవారం పెద్ద కౌకుంట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బూదగవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు అతిసార వ్యాధి గురించి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. మూడు లేదా అంతకంటే ఎక్కువసార్లు పలిచటి ద్రవ విరోచనాలైతే దానిని అతిసార వ్యాధిగా పరిగణిస్తారని తెలియజేశారు, అతి సార వ్యాధి బ్యాక్టీరియా, వైరస్ మరియు ఇతర సూక్ష్మజీవుల ద్వారా వ్యాప్తి చెందుతుందని, కాబట్టి విద్యార్థులం దరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడమే కాక, ప్రతిరోజు రెండు సార్లు చేతులు శుభ్రం చేసుకోవాలని ముఖ్యంగా భోజనం చేసే ముందు మరియు మలవిసర్జన తర్వాత తప్పనిసరిగా సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవాలని డెమో రూపంలో వివరించారు. విద్యార్థులందరూ తమ తల్లిదండ్రులకు అతిసార వ్యాధిపై అవగాహన కల్పించా లని తెలియజేశారు. సురక్షిత మంచినీరు కాచి చల్లా ర్చిన నీరు లేదా క్లోరిన్‌తో శుద్ధి చేసిన నీరు మాత్రమే సురక్షిత మంచినీరుగా పరిగణిస్తారని తెలియజేశారు

## కేజీబీవీలో విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

### జడ్పీ సీఈవో మెకియా నిధియా దేవి...

**విశాలాంధ్ర-డి.హీరేహాళ్ :** కేజీబీవీ స్కూల్లో చదువుతున్న పిల్లలందరూ క్రమశిక్షణతో మెలిగి బాల్యవివాహాలు చేసుకోకుండా వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తూ మంచి భవిష్యత్తును కలిగి ఉండాలని జడ్పీ సీఈఓ మెకియా నిధియా దేవి సూచించారు. బుధవారం జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లాలోని 8 మండలాలలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ బిఎన్. డాక్టర్ శ్రీదేవి ఆధ్వర్యంలో బాల్యవివాహాలు గృహహింస, పిల్లలకు సంబంధించిన చట్టాలు ఫోక్సో చట్టం మరియు చైల్డ్ హెల్ప్ లైన్ సర్వీసెస్ గురించి అవగాహన సదస్సులు నిర్వహించారు. ఇందులో భాగంగా డి హీరే హాల్ మండలం అన్ని శాఖల అధికారులతో కలిసి బాల్యవివాహాలను చేసుకోవడం వల్ల కలిగే అనర్థాలు, పిల్లలకు గల హక్కులు, చట్టాల గురించి కేజీబీవీ పిల్లలతో కలిసి కేజీబీవీ స్కూల్ నుంచి బస్టాండ్ వరకు అక్కడి నుంచి తిరిగి కేజీబీవీ స్కూల్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని కేజీబీవీ స్కూల్‌లో మండల అధికారులు , సర్పంచు, మరియు గ్రామస్తులతో జెడ్పి సీఈవో మెకియా నిదియా దేవి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పి సీఈవో మాట్లాడుతూ బాల్యవివాహాల నిరోధానికి సంబంధించి గ్రామాల్లో విస్తృత అవగాహన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. స్కూల్ డ్రాప్ అవుట్స్ ఉన్న వారిని అందరిని తిరిగి స్కూల్లో చేర్పించాలని, టీచర్స్ పిల్లల పట్ల స్నేహభావం కలిగి పిల్లలకు మంచి విద్యా బుద్ధులు నేర్పించాలని సూచించారు. స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ వారు ఈ కార్యక్రమాన్ని చాలా చక్కగా నిర్వహించారని , ఇలాంటి కార్యక్రమాల ద్వారా మంచి మెసేజ్ పిల్లలకు, ప్రజలకు చేరుతుందని ఇలాంటి అవగాహన సదస్సులు ఇంకా ఏర్పాటు చేసి గ్రామాలలో అవగాహన కల్పించాలని సూచించారు. సిడిపిఓ ప్రభావతి మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం వల్ల కలిగే అనర్థాలు మరియు పిల్లలపై జరిగే లైంగిక దాడులను ఆపడానికి స్త్రీ మరి శిశు సంక్షేమ శాఖ వారు ప్రత్యేక చర్యల ద్వారా పిల్లలకు మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. జిల్లా బాలల పరిరక్షణ సమితి నుండి డిసిపిఓ మంజునాథ్ మాట్లాడుతూ జువైనల్ జస్టిస్ యాక్ట్ గురించి క్షుణ్ణంగా వివరించారు. చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకటేశ్వరి మాట్లాడుతూ పిల్లలకు హక్కులతో జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు, అభివృద్ధి చెందే హక్కు, మరియు భాగస్వామ్యపు హక్కుల గురించి పిల్లలకు క్షుణ్ణంగా వివరించారు. అదేవిధంగా తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు మరియు నిర్లక్ష్యానికి గురైన పిల్లలకు సంబంధించి ఇని ట్యూషనల్ కేర్ సర్వీసెస్ ఏ విధంగా వారికి అందు బాటులో ఉన్నాయన్న విషయాలను వివరించారు. దత్తతకు సంబంధించి ఈ కార్యక్రమంలో అవగాహన కలిగించారు. చిన్నపిల్లలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి కూడా స్కూల్లో అవగాహన కల్పించాలని ఆమె తెలియజేశారు. అలాగే ఎంపీడీవో రఘునాథ్, తహసిల్దార్ ఈశ్వర్ రెడ్డి, చైల్డ్ మ్యారేజెస్ ను నిర్మూలించడానికి తగు చర్యలు చేపడతామని, అందుకు సంబంధించిన అవగాహన సదస్సు కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. కేజీబీవీ లో అవగాహన సదస్సు అనంతరం స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో ఓబులాపురంలో గ్రామ సభ నిర్వహించి, కళాజాతర వారిచే బాల్య వివాహాలు నిర్మూలనకై జోగిని, బసివిని వ్యవస్థ నిర్మూలనకై లైంగిక నేరాలకు పాల్పడితే ఎటువంటి చట్టపరమైన చర్యలు ఉంటాయన్న అంశాలను వివరించారు. కార్యక్రమంలో చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ ప్రభావతి, జిల్లా బాలల పరిరక్షణ సమితి నుండి డిసిపిఓ మంజునాథ్, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకటేశ్వరి, గృహహింస సెల్ నుండి లీగల్ కౌన్సిలర్ నర్మదా తదితరులు పాల్గొన్నారు.

## పుట్టుకతో వచ్చే లోపాలపై వైద్యాధికారులకు శిక్షణ

**విశాలాంధ్ర-అనంతపురం :** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఈబి దేవి రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కమిషనర్ వారి ఆదేశాల మేరకు మూడవ బ్యాచ్‌లో అర్బన్ మెడికల్ ఆఫీసర్లకు స్టాఫ్ నర్స్ మరియు ఏఎన్ఎం లకు రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా పుట్టుకతో వచ్చు లోపాలపై బుధవారం వైద్య ఆరోగ్య శాఖ కాన్ఫరెన్స్ హాల్ నందు శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఈబి దేవి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..

పిల్లలలో పుట్టుకతో వచ్చే లోపాలు గుర్తించుట తల నుంచి పాదం వరకు చేసే పరీక్ష విధానము అప్పుడే పుట్టిన నవజాత శిశువు వయసు నుండి అంగన్వాడి మరియు కాలేజీ విద్యార్థుల వరకు వైద్య పరీక్షలు నిర్వహించి పుట్టుకతో వచ్చే లోపాలను పోషకాహార పెరుగుదల లోపాలు, జన్యుపరమైన లోపాలు, వైకల్యాలు, బరువు తక్కువ గల పిల్లలు ,నెలలు నిండక ముందే పుట్టిన పిల్లలు, మెల్ల కన్ను,గ్రహణ మొర్రి ,వంకర పాదాలు ,కంటి శు క్లాలు, వినికిడి లోకం ,గుండె సంబంధిత వ్యాధులు వివిధ రకాల అంటు వ్యాధులను గుర్తించి సత్వర చికిత్స అందించుట శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో చికిత్స చేయలేని వారికి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని త్వరిత చికిత్స కేంద్రానికి నెంబర్ 99 ఓపి కేంద్రానికి రెఫర్ చేయాలన్నారు. తదుపరి త్వరిత చికిత్స కేంద్రంలో స్క్రీనింగ్ నిర్వహించి తగువిధంగా చికిత్సలు ఫిజియోథెరపీ రిహాబిలిటేషన్ మొదలగు సర్వీసులను అందిస్తున్నాము. తదుపరి శస్త్ర చికిత్సల అవసరమైన పిల్లలకి ఉచితంగా ఆపరేషన్లు చేపడుతుందన్నారు .అందులో వినికిడి లోపం, మెల్లకన్ను, కంటి రెటీనా, పెదవి, నోరు, గుండె పనితీరు లో లోపం వంటి పిల్లలకు దాదాపు 8 నుంచి10 లక్షల రూపాయల వరకు ఉచితంగా చికిత్స అందించబడుతుందన్నారు.

వినికిడి లోపం గల పిల్లలకి వినికిడి పరికరాలు ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు.. డి ఈ ఐ సిలో పై వ్యాధులకు ప్రత్యేకమైన తెరపిస్టులు చికిత్సలు మరియు రిహాబిలి టేషన్ అందిస్తారన్నారు. ప్రతి ఫెసిలిటీలో అడాలసెంట్ బాల, బాలికల కోసం ప్రత్యేక స్నేహపూరిత క్లినిక్ ను అందించాలన్నారు. బడి బయట ఉన్న కౌమార బాలికలకు అనీమియా వ్యాధి- హిమోగ్లోబిన్ పరీక్ష నిర్వహించి అవసరమైన వారికి ఇంటి వద్దనే నీలం రంగు ఐరన్ టాబ్లెట్లు నెలకు సరిపడా ఇవ్వాలన్నారు.

నెలకు ఒక్కసారైనా విద్యాధికారి తన పరిధిలోని విద్యాలయాల్లో మెడికల్ స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించా లన్నారు. అన్ని అంగన్వాడి, ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలందరికీ మెడికల్ స్క్రీనింగ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ జి.నారాయణ స్వామి, చిన్న పిల్లల వైద్యులు డాక్టర్. శ్రీవిద్య, మెడికల్ ఆఫీసర్ డాక్టర్. మల్లీశ్వరి, డిఈఐసి మేనేజర్ డి.రజిత మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## కేజీబీవీలో మజ్జిగలేని భోజనాలు వడ్డింపు

అధికారుల ఆకస్మిక తనిఖీలు ..

బయటపడ్డ అక్రమాలు

నిధులు స్వాహా సౌకర్యాలు నిల్

కేజీబీవీలో పిల్లల పొట్ట కొడుతున్న సిబ్బంది

**విశాలాంధ్ర-శింగనమల:** విద్యార్థులకు మజ్జిగ లేకుండా నీళ్ల పప్పుతో అరకొర భోజనం కేజీబీవీ ని అగస్మాత్తుగా తనిఖీ చేసిన ఎమ్మార్వో, ఎంపీడీవో, ఎంఈఓ సమస్యల హోరం అధికారుల ముందు ప్రత్యక్షం బలై పోతున్న విద్యార్థినిలు శింగనమల మండల కేంద్రంలోని కేజీవి స్కూల్లో ప్రభుత్వ అధికారులు ఎమ్మార్వో శోభన్ బాబు ఎంపీడీవో రమణ, ఎంఈఓ1 నరసింహారాజు, ఎంఈఓ2 శివప్రసాద్ లు బుధవారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు, తనిఖీలో పలు సమస్యలతో కూడినహారం ఎదురయింది, ఈ సందర్భంగా అధికారులు తహసిల్దార్ శోభన్ బాబు,ఎంపీడీవో రమణ, ఎంఈఓ లో నరసింహారాజు శివప్రసాద్ లు మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనం నాణ్యత లేకుండా, నీళ్ల పప్పు,మజ్జిగ లేకుండా అరకొరా భోజనం విద్యార్థినిలకు పెట్టారు, తనిఖీ అధికారులు భోజనాలను అక్కడే తిని రుచి చూశారు, భోజనాలు సక్రమంగా చేయనందున అందులో మజ్జిగ లేకుండా వడ్డించినందున, కేజీబీవీ సిబ్బందిని హెచ్చరించారు, అధికారులు గట్టి పప్పు మరియు మజ్జిగ కూడా ఇచ్చి నాణ్యమైన భోజనం పిల్లలకి అందించాలని తెలిపారు, ఎస్ ఓ ఎక్కడికెళ్లిందని విచారించగా ట్రైనింగ్ లో ఉందంటూ సమాధానం ఇచ్చారు, ఈ సమస్యఇన్చార్జి ఎస్ఓ మెనూ ప్రకారం మంచి భోజనం అందించకుండా, పిల్లల పొట్ట కొట్టకూడదని, ప్రభుత్వం అందించిన మెనూ ప్రకారం విద్యార్థినులకు మంచి పౌష్టికాహారం అందించాలని అధికారులు సూచించారు, ఇంచార్జి ఎస్ ఓ ఖచ్చితంగా విధులను నిర్వర్తించాలని సూచించారు, పప్పు మజ్జిగ కచ్చితంగా ఇవ్వాల్సింది పోయి నిధులను స్వాహా చేస్తున్నారా? అని మండిపడ్డారు, పిల్లల కడుపు మీద కొడితే సహించలేమంటూ అధికారులుకేజీబీవీ సిబ్బందిని హెచ్చరించారు, కేజీబీవీ లోని రికార్డులు పరిశీలించి అటెండెన్స్ రికార్డులు మరియు ఆన్లైన్ లో కూడా తేడాలు ఉన్నాయంటూ రికార్డులను ఆన్లైన్లోకి కరెక్ట్ గా ఉండే విధంగా చూసుకోవాలని తెలిపారు, సక్రమమైన భోజనాలు వడ్డించకుండా రికార్డులను తారుమారు చేస్తే పై స్థాయి అధికారులకు నివేదికలు పంపుతామన్నారు, విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టకపోతే మీ పైన కఠిన చర్య తప్పవని హెచ్చరించారు.

## ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డికి ఘన స్వాగతం

**విశాలాంధ్ర-యాడికి:** ఎమ్మెల్యే హోదాలో జె.సి అస్మిత్ రెడ్డి మొదటిసారి యాడికి మండలానికి రావడంతో నాయకులు,కార్య కర్తలు బుదవారం ఆయనకు ఘనస్వాగతం పలికారు. పాత పోలీస్ స్టేషన్ సర్కిల్ నుండి ప్రధాన కూడలి వరకూ అశేష జనసంద్రం మధ్య బాణాసంచా పేలుస్తూ, డప్పు వాయిద్యాల నడుమ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఆయన వెంబడి ప్రజలు, నాయకులు, కార్యకర్తలు బ్రహ్మరథం పట్టారు. అనంతరం చెన్నకేశవ స్వామి గుడి ఎదురుగా జరిగిన బహిరంగ సభలో ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి మాట్లాడుతూ తనపట్ల ప్రజలు చూపిన ఆదరాభిమానాలను మరువలేనన్నారు. భారీ మెజార్టీతో గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని, నా మీద నమ్మకంతో గెలిపించిన మీ నమ్మకాన్ని వమ్ము కానివ్వనన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రుద్రమ నాయుడు, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, రవి కుమార్ రెడ్డి, పరిమి చరణ్, తిరంపురం నీలకంఠ, గుండా నారాయణస్వామి, విశ్వనాథ్ దడియాల ఆది, జనసేన మండల కన్వీనర్ సునీల్, బిజెపి మండల ఉపాధ్యక్షుడు వద్ది రాజశేఖర్, పాల్గొన్నారు.

## జీజీహెచ్‌లో సిటీ స్కాన్ ప్రారంభం

**విశాలాంధ్ర-అనంతపురం :** ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి నందు రేడియాలజీ విభాగంలో ఎస్ఎల్ డయాగ్నస్టిక్ ఆధ్వర్యంలో నిర్వహించిన సీటి స్కాన్ మిషన్‌ను వున్నతీకరణ చేసిన సందర్భంగా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి అడిషనల్ డి.ఎం.యి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు బుధవారం పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ .యం ఓ డాక్టర్ హేమలత, రేడియాలజీ హెచ్.ఓ.డి. డాక్టర్ సురేష్ పాల్గొన్నారు.

## పురుగు మందులు, ఎరువులు ఎమ్మార్పీ ధరలకే ఇవ్వాలి

**విశాలాంధ్ర-కణేకల్లు:** మండలంలో ఉన్న రైతులకు పురుగు మందులు, ఎరువులు ఎంఆర్‌పి ధరలకే అందించాలని ఏడిఏ లక్ష్మణ్ నాయక్, ఏఓ శ్రావణ్‌కుమార్‌లు పేర్కొన్నారు. మండల కేంద్రంలో అగ్రికల్చర్ ఆఫీసులో మండల వ్యాప్తంగా ఉన్న ఎరువులు పురుగుమందుల షాప్ యజమానులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులకు ఈ మాసం నుండి రైతులు పంటలు వేసే తొలి సీజనల్ ప్రారంభం సందర్భంగా ఎరువులు, పురుగుమందు షాపు యజమానులు రైతులకు కావలసిన, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, మొదలగునవి, అందుబాటులో ఉంచుకోవాలి, రైతులు ఏ వస్తువు అడిగిన, నాణ్యమైనవి, ప్రభుత్వం కేటాయించిన ఎమ్మార్పీ ధరకే, వారికి ఇవ్వాలని తెలిపారు. ఎమ్మార్పీ ధర కాదని, ఎక్కువ ధరకు అమ్మిన బిల్లులు ఇవ్వకుండా ఇచ్చిన, నాణ్యత లేనివి, కంపెనీ పేరు లేనటివి, అమ్మినట్లు నా దృష్టికి, ఆ షాప్ సీజ్ చేసి లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

## ప్రతిభ గల విద్యార్థికి పూర్వ విద్యార్థుల సహాయం

**విశాలాంధ్ర-యాడికి :** యాడికి జెడ్పి ఉన్నత పాఠశాలలో 2002లో పదవ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు అంతా కలిసి బుధవారం గత మార్చిలో పదవ తరగతిలో పాఠశాల టాపర్‌గా వెంకటేష్ అనే విద్యార్థికి 10000/- రూపాయలు బహుమతిని ప్రధానోపాధ్యాయులు చేతుల మీదుగా అందజేశారు. మిత్రులు చంద్రశేఖర్, కృష్ణమూర్తి, విశ్వనాథ, వేణు, గుండా నారాయణ స్వామి, జన, వలి, మల్లికార్జున్, పరమేశ్వర్ రెడ్డి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి

www.visalaandhra.com

కర్నూలు, గురువారం 4, జులై 2024




# కేజీబీవీ ఎస్ఓపై మంత్రి సవితమ్మ ఫైర్

## - వేధింపులపై విద్యార్థినులు మంత్రి సవితమ్మకు లేఖ...
## - ఆకస్మికంగా కేజీబీవీ బడి తనిఖీ
## - ఇన్‌చార్జి వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు

**విశాలాంధ్ర-సోమందేపల్లి :** మండలం పరిధిలోని పాపిరెడ్డిపల్లి కేజీబీవీ పాఠశాలకు సంబంధించిన విద్యార్థుల సమస్యలపై కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులు బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవితమ్మ కు సమస్యలపై లేఖ రాశారు. ప్లీజ్ మా సమస్యలు పరిష్కరించండి అంటూ విద్యార్థుల సంతకాల లేఖ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఉన్నతాధికారులతెలిపిన పట్టించుకోలేదంటూ లేఖలో అవేదన వ్యక్తం చేశారు. ఈ పాఠశాలలో ఆరవ తరగతి నుండి ఇంటర్ సెకండియర్ వరకు 250 మంది విద్యార్థినులు తమ పరిస్థితిని వివరించారు. ఈ మేరకు బుధవారం మంత్రి సవితమ్మ పాఠశాలను తనిఖీ చేసి పాఠశాలను తనిఖీ చేసిన పాఠశాలను తనిఖీ చేసి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ఉన్నత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మీ ఇళ్లలో ఇలాగే వంట చేస్తారా పిల్లలకు అంటూ మండిపడ్డారు. సమస్యలపై విద్యార్థినిలతో వ్యక్తిగతంగా మంత్రి సవిత మాట్లాడారు.. ముఖ్యంగా హాస్టల్ ఇంచార్జ్ ఎస్ఓ శాలినిదేవి తమతో డబ్బులు వసూలు చేస్తున్నారని, అర్ధరాత్రి సమయంలో ఇంచార్జ్ ఎస్ఓ హాస్టల్ నుండి బయటికి వెళ్లడం రావడం తమకు భయమేస్తున్నదని తెలియజేశారు. మంత్రి హాస్టల్‌లోని వంటగదిని పరిశీలించి అక్కడ కుళ్ళిపోయిన కాయగూరలను చూసి హాస్టల్ వార్డెన్‌తో మీ ఇంటికి కూడా ఇలాంటి కాయ గూరలతో భోజనాలు చేస్తారా అంటూ ఆగ్రహాన్ని వెలిబుచ్చారు. బాత్రూమ్స్ పరిశీలించి శుభ్రంగా లేకపోవడంతో హాస్టల్ వార్డెన్‌పై మండిపడ్డారు. హాస్టల్ వార్డెన్ శాలినిదేవి వ్యవహార శైలిపై, ఆమెపై వచ్చిన ఆరోపణలతో వెంటనే శాలినిదేవిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మండలంలో ఇద్దరు ఎంఈఓలు ఉన్నా ఉపయోగం లేదని ఇప్పటికే విద్యార్థులు మీ వరకు ఈ సమస్యలు తీసుకువచ్చారని అయినా కూడా మీరు పట్టించు కోకుండా పోవడంతో నేడు విద్యార్థులు నాకు ఉత్తరం రాయాల్సిన పరిస్థితి ఏర్పడిందని అసహనం వ్యక్తం చేశారు. గతంలో కూడా ఈమెపై ఇలాంటి ఆరోపణలు వచ్చినా ఎందుకు ఇక్కడి నుంచి పంపించలేదని మండల విద్యాధికారులను మంత్రి ప్రశ్నించారు. ఈ ఘటనలు పునరావృతమైతే మీపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ పాఠశాలలో ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేయాలని ఆ పెట్టెను ప్రతివారం పరిశీలించాలని తెలిపారు. కార్యక్రమంలో డివైయు రంగస్వామి, మండల విద్యాధికారులు ఆంజనేయులు నాయక్, ఆనంద్ బాబు తెలుగుదేశం నాయకులు నీరుగంటి చంద్ర, డివి ఆంజనేయులు, మాజీ జెడ్పిటిసి వెంకటరమణ, సిద్ధ లింగప్ప, మాజీ ఎంపీటీసీలు కిష్ట, బావయ్య, టౌన్ కన్వీనర్ సురేష్, నల్లగొండరాయన పల్లి హరికృష్ణ, గుడిపల్లి రంగప్ప, బోర్ గోపాల్, మద్దిలేటి, జనసేన నాగరాజు పాల్గొన్నారు.

# అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి

## మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు

**విశాలాంధ్ర-రొళ్ల:** మండలంలో అన్ని శాఖ అధికారులు ప్రజా ప్రతినిధులు కలిసి సమన్వయంతో పనిచేయాలని మడకశిర శాసనసభ్యులు ఎమ్మెస్ రాజు పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం నందు ఎంపీపీ కవిత అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మడకశిర శాసనసభ్యులు ఎమ్మెస్ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకొని మండల వ్యాప్తంగా ఉన్న పెండింగ్ పనులను పూర్తి చేయాలని వారు తెలిపారు. అనంతరం వివిధ శాఖల అధికారులు తమ నివేదికలతో హాజరై వివరాలను ఎమ్మెల్యే గారికి చదివి వినిపించారు. అందులో భాగంగా ఉపాధి హామీ పథకం ద్వారా చింత,దానిమ్మ,డ్రాగన్ ఫ్రూట్స్ పూల మొక్కలు తదితర చెట్లను మూడు సంవత్సరాలపాటు వాటిని రక్షించడానికి పూర్తి బాధ్యత వహిస్తామని తెలిపారు. అదేవిధంగా ఉపాధి పనులను రైతులకు అనుకూలంగా ఉండే పనులను కల్పించాలన్నారు. అనంతరం ఆర్టీసీ అధికారులు మాట్లాడుతూ ఏం.రాయపురం బస్సును పునరుద్దరించడం జరిగిందని, మిగిలిన గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని, మండల కేంద్రం లోని బస్టాండ్ ఆవరణలో సులభ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఆర్.వద్రహట్టి నుండి హుణిసేకుంట గ్రామానికి ప్రజలు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని తారు రోడ్డు సౌకర్యం కల్పించాలని అర్ధాంతరంగా ఆగిపోయిన రైతు భరోసా కేంద్రాలను పూర్తిచేయాలని, ప్రతి గ్రామంలోనూ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు ఇద్దరు సమన్వయంతో గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని మండలానికి పీ.హెచ్.సి సెంటర్ ఏర్పాటు చేయాలని వైద్య సిబ్బంది ఎమ్మెల్యే గారికి వినతిపత్రాన్ని అందించారు. రైతు భరోసా కేంద్రాల్లో ఉండే వ్యవసాయ సహాయకులు క్షేత్రస్థాయిలో వ్యవసాయం పట్ల,ఉపాధి హామీ పనుల పట్ల అవగాహన కల్పించి రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న సబ్సిడీ సదుపాయాలు వివరించాలన్నారు

# రెవెన్యూ అధికారులు మెరుగైన సేవలందించాలి...

**విశాలాంధ్ర-పుట్టపర్తి :** ప్రజలకు మెరుగైన సేవలు రెవిన్యూ శాఖ అధికారులు అందించి ప్రజల మన్ననలను పొందాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని తాసిల్దార్లు, అధికారులకు దిశ నిర్దేశం చేశారు. జెసి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించి పరిష్కరించాలన్నారు. జననం నుంచి మరణం వరకు విద్యార్థులకు అందించే ధ్రువీకరణ పత్రాల వరకు రెవిన్యూ అధికారుల పాత్ర కీలకమన్నారు. మెరుగైన సేవలు అందించడం వల్ల ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు. ఎక్కువగా రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యలు ప్రజలు ఎదుర్కొంటున్నారని వాటిపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలను కార్యాలయాల చుట్టూ పదేపదే తిప్పుకోకుండా సమస్యలు శాశ్వతంగా పరిష్కార దిశగా అధికారులు పనిచేయాలన్నారు. కుల ధ్రువీకరణ పత్రాల జారీకై అనుసరిస్తున్న విధి విధానాల గురించి వివరించారు. ధ్రువీకరణ పత్రాలు విద్యార్థులకు వేగవంతంగా అందించాలని ఆదేశించారు.

# మానవత్వం చాటుకున్న కౌన్సిలర్

**విశాలాంధ్ర-ధర్మవరం:** పట్టణంలోని 16వ వార్డులో చేనేత వృత్తినే నమ్ముకున్న పోలా శ్రీనివాసులు కుటుంబ పరిస్థితి దారుణంగా ఉండడం, నేసిన చీరకు గిట్టుబాటు ధర లేకపోవడంతో కుటుంబ పోషణ భారం అధికమయింది. సమాచారం అందుకున్న 16వ వార్డ్ కౌన్సిలర్ కేతా లోకేష్ వారి ఇంటికి వెళ్లి సమస్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారి కుటుంబ పోషణ కొరకు పిల్లల చదువుల ఫీజుల కొరకు తన వంతుగా రూ.13 వేలను నేరుగా చెల్లించారు. చేనేత కార్మికుడు పోలా శ్రీనివాసులు మాట్లాడుతూ మాలాంటి పేదవారికి కౌన్సిలర్ ఇలా సహాయం చేయడం మరుపురాని విషయమని కృతజ్ఞతలను తెలిపారు. పోలా శ్రీనివాసులు కొడుకు పూల అవినాష్‌కు తానిచ్చిన డబ్బులను ఫీజుగా చెల్లించాలని తెలిపారు. ముస్ముందు కూడా నా అన్నదండలు ఉంటాయని కౌన్సిలర్ తెలిపారు. కుటుంబ సభ్యులు అందరూ కలిసి కౌన్సిలరుకు కృతజ్ఞతలు తెలిపారు.

# రైలు కింద పడి వృద్ధుడు మృతి...

**విశాలాంధ్ర-ధర్మవరం:** పట్టణంలోని సుందరయ్య నగరకు చెందిన పెదగొండ గారి నరసింహులు (78) మతిస్మితం లేకపోవడంతో పట్టణంలోని రేగాటిపల్లి రైల్వే గేట్ కూతవేటు దూరంలో రైలు కిందపడి మృతి చెందడం జరిగిందని రైల్వే జీఆర్పి పోలీసులు తెలిపారు. రైల్వే జి ఆర్ పి హెడ్ కానిస్టేబుల్ ఎర్రిస్వామి కృష్ణ మాట్లాడుతూ మృతి చెందిన వ్యక్తి సొంత గ్రామం చెన్నై కొత్తపల్లి మండలం మేడాపురం గ్రామము ఉండి, కొన్ని నెలల కిందట ధర్మవరం పట్టణం సుందరయ్య నగర్‌లో వారి కుటుంబం వద్ద నివసించేవాడు. మృతునికి 2019లో డెంగీ జ్వరంతో నరాల బలహీనత, ఆస్మా, మూత్ర పిండాల వ్యాధులు వచ్చాయని, అనంతపురం పలు చోట్ల వైద్య చికిత్సలు అందించిన ఫలితం లేకపోయిందని తెలిపారు. దీంతో మతిస్థిమితం లేకుండా పోయిందని కుటుంబ సభ్యులకు కూడా తెలపడం జరిగిందని తెలిపారు. ఎక్కడికి పోతాడో? ఎప్పుడు వస్తాడో? తెలియని పరిస్థితి ఉండే దని, దీంతో అనుకోకుండా రైల్వే పట్టాల వద్ద వచ్చి ఉండడంతో గుర్తు తెలియని రైలు ఢీకొట్టిందని, ఇది ఆత్మహత్యగా భావిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# విద్యార్థులకు పిండి వంటలు పంపిణీ

**విశాలాంధ్ర- ధర్మవరం :** పట్టణంలోని శివానగర్లో గల ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చే భోజన కార్యక్రమంలో భాగంగా తనవంతుగా వడలు, వెజిటబుల్ రైస్, ఉల్లగడ్డ కూరతో పాటు కోడిగుడ్లతో కూడిన భోజనాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన ప్రభుత్వం రావడం జరిగిందని విద్యార్థులకు మంచి పౌష్టికాహారాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అంబటి సన్నత్,రాళ్లపల్లి షరీఫ్, శివ శంకర, రామకృష్ణ, బోనాల జయలక్ష్మి, బంధనాదం కృష్ణమూర్తి ,ఐ టిడిపి సోషల్ మీడియా సభ్యులు పాల్గొన్నారు.

# ఖాద్రీశుని సన్నిధిలో కర్ణాటక మంత్రి

**విశాలాంధ్ర-కదిరి:** కదిరి పట్టణంలో వెలసిన శ్రీమత్ ఖాద్రీశుని కర్నాటక పౌర సరఫరాల శాఖ మంత్రి కె.హెచ్ మునియప్ప దర్శించుకొన్నారు. బుధవారం ఉదయం మంత్రికి ఆలయ కార్యనిర్వహణాధికారి వెండిదండి శ్రీనివాస రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు తూర్పు రాజగోపురం నుండి పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం శ్రీస్వామి, అమ్మవార్ల ఆలయములో ప్రత్యేక పూజలు చేయించి శ్రీస్వామి చిత్రపటం, శేష వస్త్రంలతో సన్మానించారు. తహసిల్దార్ పుల్లారెడ్డి, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# కొండను తవ్వి ఎలుకను పట్టారు...

## రూ.11 కోట్ల గాను 78, వేలు రికవరీ..

**విశాలాంధ్ర-లేపాక్షి :** గత పది రోజులుగా లేపాక్షి మండల వ్యాప్తంగా ఉన్న 12 పంచాయతీలలో ఏడాది పనుల్లో సామాజిక తనిఖీ బృందం తనిఖీలు చేసి తూతూ మంత్రంగా ముగించింది. బుధవారం ఉదయం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన సామాజిక తనిఖీ మండల నిర్వహించారు.2023 ఏప్రిల్ 1 నుండి 2024 మార్చి నెల వరకు తనిఖీ నిర్వహించగా 800 పైగా పనులు నిర్వహించగా 11 కోట్లు ఖర్చు చేసినట్టు అందులో 78 వేలు ఉపాధి అధికారుల నుండి రికవరీ చేసినట్టు ప్రాజెక్టు డైరెక్టర్ విజయేంద్ర ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో డిస్టిక్ విజిలెన్స్ ఆఫీసర్ రమణారెడ్డి శివానంద నాయక్ ఎంపీడీవో వాసుదేవ్ గుప్త సామాజిక తనిఖీ బృందం ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి ...

**విశాలాంధ్ర-ధర్మవరం:** పట్టణంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల కొరకు మౌలిక సదుపాయాలను వెనివెంటనే కల్పించాలని ఐక్య విద్యార్థి సంఘాల పిఎస్యు రాష్ట్ర అధ్యక్షుడు మంజూరు నరేంద్ర, ఏఐఎస్బి జిల్లా కార్యదర్శి పోతులయ్య,పిబిఎస్యు జిల్లా కార్యదర్శి నిరంజన్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని జీవనజ్యోతి స్కూల్లో ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంఈఓ పాఠశాలకు వెళ్లి మరుగుదొడ్లను పాఠశాలలు సందర్శించి తగిన చర్యలు వెంటనే తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ గతంలో విద్యాశాఖ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న పెడచెవిన పెట్టడం దారుణమని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా వేలాది రూపాయలు విద్యార్థుల నుండి వసూలు చేయడం కనీస మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేకపోవడం ఏమిటని మండిపడ్డారు. జీవన్ జ్యోతి పాఠశాలలో కేవలం 10 బాత్రూంలు మాత్రమే ఉన్నాయని వందలాదిమంది విద్యార్థినీ విద్యార్థులు ఉంటే, ఈ బాత్రూంలు ఎలా సరిపోతాయని నిలదీశారు. పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తున్నదని వారు మండిపడ్డారు. అదేవిధంగా అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో మరుగుదొడ్లు అధికంగా ఉండాలని, తాగునీటి సరఫరా తప్పనిసరిగా ఉండాలని, లేకుంటే పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు పిఎస్యు పట్టణ అధ్యక్షులు నందకిషోర్, సునీల్, శుక్రుత్, సాయినాథ్, పురుషోత్తం, భరత్, కిషోర్ పాల్గొన్నారు.

# డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తులు ..

**విశాలాంధ్ర-ధర్మవరం :** పట్టణంలోని ప్రభుత్వ కేహెచ్ డిగ్రీ కళాశాలలో బిఏ, బీకాం, బీఎస్సీ కోర్సులకు ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఆన్లైన్ ద్వారా అలాగే కళాశాలలో కూడా దరఖాస్తు చేసుకోవడానికి ఏర్పాట్లు కూడా పూర్తి చేశామని తెలిపారు. ఈనెల 10వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, ఈనెల 11 నుంచి 15 వరకు నచ్చిన కోర్సులకు ప్రవేశాలకు ఐచికంగా ఉంటుందని తెలిపారు. కావున ఈ అవకాశాన్ని డిగ్రీలో చేరి విద్యార్థులు సద్వినియోగం చేసుకొని మంచి భవిష్యత్తుకు శ్రీకారం చుట్టాలని తెలిపారు.

# అంబేద్కర్ స్ఫూర్తితో చంద్రబాబు పాలన

## -దళితులకు గతంలో ఎప్పుడూ లేని విధంగా న్యాయం
## -అంబేద్కర్ 133వ జయంతి ఉత్సవాల్లో ఎమ్మెల్యే పరిటాల సునీత

విశాలాంధ్ర-రాప్తాడు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తితోనే సీఎం చంద్రబాబు నాయుడు పాలన సాగుతోందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. చెన్నేకొత్తపల్లి మండల కేంద్రంలో అందరివాడు ఉత్సవ కమిటీ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 133వ జయంతి ఉత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం దళితులతో కలసి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అందరివాడు ఉత్సవ కమిటీ వారు భారీ గజమాలతో పరిటాల సునీతను సత్కరించారు. ఆ తర్వాత 10 వ తరగతిలో 500మార్కులకు పైన వచ్చిన ఎస్సీ విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెమెంటో అందజేశారు. ఈసందర్భంగా సునీత మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగం వలన ఎంతో మంది అట్టడుగు వర్గాల వారికి న్యాయం జరుగుతోందన్నారు. నేడు అనేక మంది ఎస్సీలు చట్టసభలకు వెళున్నారంటే అది ఆయన ఘనతేనన్నారు. అంబేద్కర్ కేవలం దళిత వర్గానికి చెందిన వారు మాత్రమే కాదని.. ఆయన అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. ఆయన స్ఫూర్తితోనే సీఎం బాబు నేడు ఒక దళిత మహిళకు హోం మంత్రి పదవి ఇచ్చారన్నారు. అనేక మందికి రాజకీయంగా ప్రాధాన్యత కల్పించారన్నారు.

# గ్రీన్ ఫీల్డ్ హైవే పనులను అడ్డుకున్న రైతులు...

## పంట పొలాలను లాగేసుకున్నారు...రోడ్లు వేసేస్తున్నారు
## భూ నష్ట పరిహారం కోసం 15 మంది రైతుల ఆందోళన

**విశాలాంధ్ర-గోరంట్ల:** ఉన్న భూమిలో వ్యవసాయ పంటలు సాగు చేసుకుని జీవనం సాగిస్తున్న భూములను రోడ్డు విస్తరణ పనులకు తీసుకొని మాకు ఇంతవరకు భూ నష్టపరిహారం ఇవ్వడం లేదని ఆగ్రహించిన రైతులు గ్రీన్ ఫీల్డ్ హైవే పనులను అడ్డుకున్నారు. గోరంట్ల మండలంలోని మల్లెల వద్ద చేపడుతున్న గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనుల కోసం తీసుకున్న భూములలో ఇంకా దాదాపు 15 మంది రైతులకు 15 ఎకరాలకు సంబంధించి సర్వేనెంబర్ 22, 28, 37, 42 లలో రైతులకు చెందిన భూములకు ఒక్కో ఎకరాకు 17 లక్షల 36 వేలు నిర్ణయించి ఇంకా రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేయడం లేదని రెవెన్యూ అధికారులు కాలయాపన చేస్తున్నారని బుధవారం రోడ్డు పనులను నిలిపివేశారు. జెసిబి వాహనాలకు పనులు చేయరాదని ఎదురుగా బయటాయించి అడ్డుకున్న సంఘటన చోటుచేసుకుంది. మల్లెల గ్రామానికి చెందిన వెంకటాచారి నారాయణప్ప, గరిక నారాయణప్ప, ఆవుల లక్ష్మీనరసప్ప, సోము, గంగాద్రి, రామప్ప, శారదమ్మ, ఈరప్ప, ఒంటిపి రంగప్ప, శ్రీరాములు, వెంకటరాముప్ప, వెంకట రాముడు చాకల, చాకల వెంకటేష్, తిరుపాలు, చిన్న రంగప్ప, నరసింహప్ప ,నాగరాజు తదితరులు తమకు నష్టపరిహారం ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమకు నష్టపరిహారం అందించేంతవరకు హైవే నిర్మాణ పనులు నిలిపివేయాలని కోరారు. దీంతో రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని, కార్యాలయం చుట్టూ తిరుగుతున్న మాకు రావాల్సిన నష్టపరిహారం ఇవ్వడం లేదని ఆరోపించారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో దంత వైద్య చికిత్స

**విశాలాంధ్ర, ధర్మవరం..** పట్టణంలోని పాత ప్రభుత్వ ఆసుపత్రిలో దంతాలకు కూడా వైద్య చికిత్సలను నిర్వహించనున్నట్లు ప్రభుత్వాసుపత్రి సూపరెంటెంట్ మాధవి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ దంతాల పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు వహించాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో దంతాలకు ప్రతి సోమ, బుధ, శుక్రవారాలలో మాత్రమే డాక్టర్ వివేకులాయపచే వైద్య చికిత్సలను అందించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా మా ఆసుపత్రిలో ఫిజియోథెరపీ కూడా ఉంటుందని, అవసరమైన రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఓపి చూడబడునని తెలిపారు. అన్ని రకాల జబ్బులకు కూడా వైద్య చికిత్సలను సకాలంలో అందించి ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు కూడా తీసుకోవడం జరుగుతుందని వారు తెలిపారు. కావున ఈ అవకాశాన్ని పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# రేగాటిపల్లి రైల్వే గేటుకు వంతెన నిర్మించండి

**విశాలాంధ్ర-ధర్మవరం:** పట్టణంలోని రేగాటిపల్లి రోడ్డు, పట్టణ నడిబొట్టున గల రేగాటిపల్లి రైల్వే గేటుకు వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా రైల్వే గేటు ప్రతి 15 నిమిషాలకు ఒకసారి గేటు వేయడం వల్ల ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, పిల్లల స్కూలు కూడా సమయం కాలాతీతమైతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారిన ప్రజల సమస్యలు ఏ ప్రభుత్వం కూడా పట్టించుకోకపోవడం అన్యాయమని వాపోతున్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా రేగాటిపల్లి రోడ్డు వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టాలని తెలుపుతున్నారు. అత్యవసరంగా రాత్రిపూట ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలంటే ఇదొక్కటే మార్గమని, అటువంటి సమయాల్లో గేటు వేయడం వల్ల రోగులు కూడా ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ధర్మారం నుండి రేగాటిపల్లి తదితర గ్రామాలకు వెళ్లాలంటే రైతులు, కూలీలు, వ్యాపారులు, అలాగే సరైన సమయానికి కళాశాలలకు పాఠశాలలకు వెళ్లడానికి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. బెంగళూరు ధర్మవరం మధ్య చాలా రైళ్ల రాకపోకలు, దాదాపు 16 గూడ్స్ బండ్లు ఈ రైల్వే గేట్ నుంచి పోవడం వల్ల చాలా సమయాన్ని తాము నష్టపోతున్నామని అండర్ బ్రిడ్జి ఏర్పాటుకు గాని ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

# వరి పైరు నార్లు నేరుగా నాటుకోవద్దు...

**విశాలాంధ్ర-ధర్మవరం:** మండల పరిధిలోని రైతులు తమ తమ పొలాల్లో వారిపై నార్లు నేరుగా నాటుకోకూడదని వ్యవసాయ అధికారి ముస్తఫా తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ వేరుశనగ పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు తెలిపిన మాదిరిగా పంట విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకొని అధిక దిగుబడికి పంట వచ్చేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. చాలామంది రైతులు మిరప టమాటా వంగా లాంటి కూరగాయలు, పంటలు సాగులో నార్లను నేరుగా నాటడం వల్ల వివిధ రకాల వైరస్, తెగుళ్లు, చీడపీడలు ఆశించే ప్రమాదం ఉందన్నారు. నార్లు నాటుకునే ముందు తప్పనిసరిగా లీటరు నీటికి 2.5 మిల్లీ లీటర్లు క్లోరి పైరిపాస్, మూడు గ్రాముల కార్బన్డిజం కలిపిన ద్రావణంలో ముంచి నాటుకుంటే ఫలితాలు మెరుగ్గా ఉంటాయని తెలిపారు. ఇక ఖరీఫ్ కింద ముందస్తుగా అక్కడక్కడ సాగు చేసిన వేరుశెనగ పంట ప్రస్తుతం షాకీయ దశలో ఉన్నందున అంతర సేద్యం చేసుకోవాలని తెలిపారు. అలాగే రసం పీల్చే పురుగులు లద్దె పురుగు శనగపచ్చ పురుగు ఆశించడానికి అనుకూలమైన వాతావరణ ఉన్నందున నివారణ చర్యలను వెంటనే చేపట్టాలని తెలిపారు. పత్తి పంటలో రసం పీలిచే పురుగు నివారణకు తొలి దశలోనే లీటర్ నీటికి ఐదు మిల్లీమీటర్ల వేప నూనె చల్లాలన్నారు.


**మహారాజశ్రీ సీనియర్ సివిల్ కోర్టు జడ్జి, ధర్మవరం**
**శ్రీ సత్యసాయి జిల్లా**

O.S.NO.72/15 E.P.NO.10/2022

కొత్త నాగన్న గారి పరశురామిరెడ్డి s/o కేశవరెడ్డి.
మరియు ...వాది డిక్రీ హోల్డర్

1) బండి వెంకట లక్ష్మి w/o late బండి ఆదినారాయణ
2) బండి మధుబాబు s/o late బండి ఆదినారాయణ
3) బండి క్రిష్ణవేణి D/O Late బండి ఆదినారాయణ R/O డోర్ నెం.12-186, గాంధీనగర్, ధర్మవరం
4) గిరక వరలక్ష్మి w/o శంకరప్ప, ఎంప్లాయి, డోర్ నెం. 7-186, మాధవనగర్, ధర్మవరం టౌన్
5) పసలూరు శాంతి w/o జగదీశ్ డోర్ నెం. 20-645, లోనికోట, ధర్మవరం టౌన్

*ప్రతివాదులు/JDRలకు సమన్లు జారీ చేయు నిమిత్తం ఇచ్చిన పత్రిక ప్రకటన*

ప్రతివాదుల మీద పై కేసులో పై కోర్టు వారు జారీ చేసిన పై డిక్రీని అమలు పరచు నిమిత్తం ప్రస్తుత E.Pని వేయడమైనది. మరియు మీకు పంపిన కోర్టు నోటీసులు మీకు జారీ కానుందున ఈ ప్రకటన ద్వారా మీకు చట్ట ప్రకారం నోటీసులు జారీ చేయడమైనది.

కావున పై కనబరచిన *J.D.R* అయిన మీ హాజరు నిమిత్తం కోర్టు వారు హాజరు నిమిత్తం 11-07-2024తేదీన ఉదయం 10.30 గంటలకు మీరు కోర్టు వారి ముందు హాజరై మీ అభ్యంతరములను తెలుపుకోవచ్చును. లేనియెడల కోర్టు వారు పరోక్షంగా తీర్మాణం చేయుదురు.

*మహారాజశ్రీ సీనియర్ సివిల్ కోర్టు జడ్జి ఉత్తర్వు మేరకు ఈ నోటీసు ఇవ్వడమైనది.*

*వాయిదా 11-7-2024*

ఇట్లు
వి.జి. బాల సుందరి
అడ్వకేట్, ధర్మవరం
వాది కక్షదారు న్యాయవాది, ధర్మవరం



In the Court of the
Senior Civil Judge, Dharmavaram

E.P. 10/2022 O.S. 16/2021

Between :-
K. Sreenivasulu ...Petitioner/D.Hr.
V/s
G. Ramesh Naidu ...Respondent/J.Dr.

*U/O 21 R.54 NOTICE*

To
G.Ramesh Naidu S/o Late G.Nagappa, aged about 43 years, Hindu, Business, Residing at D.No.2/569, O.C Colony, Behind Boys High School, Kaduri Road, Bathalapalli Village & Mandal, Sri Sathya Sai Dist.

పై దావాలోని పిటీసర్, రెస్పాండెంట్ అయిన మీ మీద పై కోర్టు నందు పిటిషనర్ దాఖలు చేసినాడు. కావున పై కోర్టు వారు పై పిటిషన్‌ను 19-7-2024వ తేదీన వాయిదా వేసి ఉన్నారు. కావున పై తేదీన మీరు ప్రత్యక్షంగా కానీ, వకీలు ద్వారా కానీ ఉదయం 10.30 గంటలకు హాజరు కావలెను. లేనిపక్షంలో పై కోర్టు వారు మీ పరోక్షంగా పై దావాను తీర్మానించెదరని తెలపడమైనది.

**వాయిదా తేదీ : 19-7-2024**

ఇట్లు
Sri. D. Vijaya Raghavendra, B.A., LLB.,
Smt. J.Sumalathaa, B.A., LLB.,
Advocates, Dharmavaram

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, గురువారం 04, జూలై 2024

# అధికారులు ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయండి-ఎమ్మెల్యే ఎమ్మెస్‌రాజు సూచన

**విశాలాంధ్ర-రొళ్ల:** మండలంలో అన్ని శాఖాధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసి సమన్వయంతో పనిచేయాలని మడకశిర శాసనసభ్యులు ఎమ్మెస్ రాజు పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం నందు ఎంపీపీ కవిత అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మడకశిర శాసనసభ్యులు ఎమ్మెస్ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకొని మండల వ్యాప్తంగా ఉన్న పెండింగ్ పనులను పూర్తి చేయాలని వారు తెలిపారు. అనంతరం వివిధ శాఖల అధికారులు తమ నివేదికలతో హాజరై వివరాలను ఎమ్మెల్యే గారికి చదివి వినిపించారు. అందులో భాగంగా ఉపాధి హామీ పథకం ద్వారా చింత,దానిమ్మ,డ్రాగన్ ఫ్రూట్స్ పూల మొక్కలు తదితర చెట్లను మూడు సంవత్సరాలపాటు వాటిని రక్షించడానికి పూర్తి బాధ్యత వహిస్తామని తెలిపారు. అదేవిధంగా ఉపాధి పనులను రైతులకు అనుకూలంగా ఉండే పనులను కల్పించాలన్నారు. అనంతరం ఆర్టీసీ అధికారులు మాట్లాడుతూ ఏం.రాయపురం బస్సును పునరుద్ధరించడం జరిగిందని, మిగిలిన గ్రామాలలో ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని అదేవిదంగా యథా విధంగా ఉన్న బస్సు సర్వీసులను కొనసాగించాలని మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణంలో సులబ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఆర్.వద్రహట్టి నుండి హుణేసేకుంట గ్రామానికి ప్రజలు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని తారు రోడ్డు సౌకర్యం కల్పించాలని అర్థాంతరంగా ఆగిపోయిన రైతు భరోసా కేంద్రాలను పూర్తిచేయాలని ముఖ్యంగా ప్రతి గ్రామంలోనూ పంచాయతీ కార్యదర్శిలు సర్పంచుల ఇద్దరు సమన్వయంతో గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని మండలానికి పీ.హెచ్.సి సెంటర్ ను ఏర్పాటు చేయాలని వైద్య సిబ్బంది ఎమ్మెల్యే గారికి వినతిపత్రాన్ని అందించారు.రైతు భరోసా కేంద్రాల్లో ఉండే వ్యవసాయ సహాయకులు క్షేత్రస్థాయిలో వ్యవసాయం పట్ల,ఉపాధి హామీ పనుల పట్ల అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న సబ్సిడీ సదుపాయాలను రైతులకు వివరించాలని సూచించారు.మల్లినమడుగు గ్రామం నుండి గుడిబండ మండలం ముత్తుకూరు గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని గత ప్రభుత్వంలో తహసీల్దార్ కు ఎన్నిసార్లు విన్నవించిన ఫలితం లేదన్నారు మీ చరవతో ఈ రోడ్డు మార్గాన్ని కల్పించాలని అన్ని గ్రామాలలో పెండింగ్లో ఉన్న ఎన్టీఆర్ సుజల స్రవంతి ప్లాంట్లను త్వరగతిగా పూర్తి చేసి ప్రతి గ్రామానికి తాగునీరు అందించాలని సూచించారు మరుసటి సర్వసభ్య సమావేశంలో 70 నుండి 80 శాతం పనులు పూర్తి కావాలని ఆ దిశగా అధికారులు బాధ్యతా యుతంగా పనిచేయాలని కోరారు. ఈకార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు బి.అనంతరాజు.వైస్ ఎంపీపీలు నాగరాజు, రత్నమ్మ తహసీల్దార్ బద్రుజాన్,ఎంపీడీవో ఆర్.వి ప్రసాద్, సీఐ రాజకుమార్ వైద్యాధికారి డాక్టర్.సృజన,ఎంఈఓ శ్రీధర్, ఏవో రాజ్యలక్ష్మి,ఎస్సై రాజశేఖర్,ఏపీవో ఓబులప్ప,ఏపీఎం నాగరాజు ఈఓఆర్డి కృష్ణప్ప,పంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్ సర్పంచులు ఎంపీటీసీలు సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# శిథిల అవస్థకు చేరిన కల్వర్టులను పరిశీలన

**విశాలాంధ్ర-రొళ్ల:** మండల పరిధిలోని కల్లురోప్పం, కొడగార్లగుట్ట గ్రామాల దగ్గర అధిక వర్షాలకు దెబ్బతిని శిథిల అవస్థకు చేరిన కల్వర్టులను పరిశీలించి ప్రజలకు వాహన దారులకు ఇబ్బందిగా ఉందని వెంటనే పునర్నిర్మించాలని అధికారులకు తెలియజేశారు. అనంతరం మండల కేంద్రంలోని రొళ్ళ బస్టాండ్ ఆవరణంలో ఉన్న ఎన్టీఆర్, డాక్టర్. బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రోడ్డు మార్గనా మండల సర్వసభ్య సమావేశానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు దాసిరెడ్డి,మండల ప్రధాన కార్యదర్శి జి.కె ఈరన్న టి.ఎన్.టి.యు.సి రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి,రాష్ట్ర ఒక్కలిగా సాధికార సమితి అధ్యక్షుడు వి.యం పాండురంగప్ప తెదేపా జిల్లా కార్యదర్శి ఎస్.రవిభూషణ్ మాజీ వైస్ ఎంపీపీ సిద్ధగంగప్ప,క్లస్టర్ ఇంచార్జ్ హెూట్టిబెట్ట భరత్,జనసేన నియోజకవర్గ సమన్వయకర్త రంగస్వామి,నియోజకవర్గ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి తెదేపా మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు హనుమంతనాయక్,భాజపా మండల అధ్యక్షుడు బద్రినాయక్,తెదేపా యువ నాయకులు యోగానంద్ దాసప్ప,మారన్న,నాగేంద్ర రమేష్,నాగేష్,కల్లురోప్పం రవికుమార్,రంగనాథ్ రాజగోపాల్ తదితర నాయుకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

**విశాలాంధ్ర-చిలమత్తూర్ రూరల్:** మండల పరిధిలోని దేమకేతేపల్లి సెక్టార్ బ్రహ్మేశ్వరంపల్లి అంగన్వాడి కేంద్రంలో బుధవారం హిందూపురం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ రెడ్డి రమణమ్మ ఆదేశాల మేరకు గ్రాడ్యుయేషన్ డే ను సూపర్వైజర్ లలితమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో ఐదేళ్ల పైబడిన చిన్నారులను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేర్పించేందుకు ప్రభుత్వం గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కేంద్రంలో ఉన్న చిన్నారులకు గర్భవతులకు బాలింతలకు మంచి పౌష్టికాహారం అందేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుందని వీటిని అంగన్వాడీద్వారా మంచి పౌష్టికాహారం అందిస్తుందని వారు తెలియజేశారు.ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదే విధంగా ప్రభుత్వ పాఠశాలలలో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఆంగ్ల విద్యను అందిస్తున్నారని తెలిపారు. వీటితోపాటు పౌష్టికాహార లైన కోడిగుడ్లు, పాలు రకరకాల కూరగాయల తో ఆకుకూరలతో వండిన ఆహారాన్ని అందిస్తున్నారని తెలియజేశారు. అదేవిధంగా మూడేళ్ల పైబడిన పిల్లలను అంగన్వాడి కేంద్రాల్లో చేర్పించే బాధ్యత ప్రతి ఒక్క తల్లిదండ్రులదని సూచించారు అనంతరం అంగనవాడి కేంద్రం ముద్దు కాన్వెంట్ వద్దు, అంగన్వాడి విద్య ఆటపాటలు విద్య అనే నినాదాలతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో సూపర్వైజర్ లలితమ్మ, టీచర్లు విజయభాస్కర్‌రెడ్డి, శంకర్ నారాయణ అంగన్వాడి కార్యకర్తలు పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు రోడ్డు సౌకర్యం కల్పిస్తాం

**విశాలాంధ్ర-గోరంట్ల:** రైతుల పొలాలకు వెళ్లేందుకు తప్పనిసరిగా రోడ్డు సౌకర్యం కల్పిస్తామని ఈఈ సుధాకర్ రెడ్డి తెలిపారు. ముదిగుబ్బ-కోడూరు (342) హైవే రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఫ్లైఓవర్ నిర్మాణం కోసం రైతులకు సంబంధించిన పొలాలకు వెళ్లేందుకు ఏర్పాటు చేసుకున్న రోడ్డు లేకుండా రోడ్డు విస్తరణ పనులు నిర్వహిస్తున్నారు. దీంతో గోరంట్ల మండలంలోని గుమ్మయగారిపల్లి గ్రామానికి చెందిన రైతులు పొలాలకు వెళ్లేందుకు వీలు లేకుండా పోవడంతో ఆందోళనతో పాటు తహసీల్దార్ ఆర్డీవో కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు దీంతో బుధవారం ఈఈ సుధాకర్‌రెడ్డి, ఏఈ నాగభూషణ ఇరువురు రైతులను పిలిపించి రహదారిని పరిశీలించారు. రోడ్డు విస్తరణ పనులలో భాగంగా డీపీఆర్ తయారు చేస్తున్న సమయంలో రోడ్డు వదలలేదని తప్పనిసరిగా రోడ్డు సౌకర్యం కల్పించేందుకు హైవే అథారిటీ అధికారులతో మాట్లాడి తప్పనిసరిగా రోడ్డు సౌకర్యం కల్పిస్తామని రైతులకు హామీ ఇచ్చారు.

## డెంగ్యూ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన



**విశాలాంధ్ర-తాడిపత్రి:** పెద్దపప్పూరు మండలంలోని జూటూరు గ్రామంలోని కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయంలో విద్యార్థులకు డెంగ్యూ వ్యాధిపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆరోగ్య పర్యవేక్షకులు శర్మాస్‌వలి, ప్రిన్సిపల్ బి.బయమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డెంగు జ్వరం ఫ్లావి విరిడే కుటుంబానికి చెందినా ఫ్లావి వైరస్ ద్వారా వస్తుంది. ఈ వైరస్లను ఏడిస్ దోమలు ఒకరి నుండి ఒకరికి డెంగు జ్వరాన్ని వ్యాప్తి చేయును. ఈ దోమలు చిన్నగా నల్లగా ఉండి శరీరం పైన తెల్లని చారలు ఉండును, తలపైన రెండు చారులు ఉండి దానికి ఇరువైపులా కొడవలి ఆకారంలో గుర్తులు ఉండును. ఈ దోమలు ఎక్కువగా పగటి పుట కుట్టును. ఈ దోమలు మన ఇంటి లోను ఇంటి పరిసరాలలో పరిశరాలలోని మంచి నీటిలో పెరిగును.ప్రతి ఒక్కరు డ్రై డే ఫ్రై డేని పాటించి, దోమ లార్వా దశలోనే నివారించాలి. దోమ ఆవాస ప్రాంతాలైన పాత టైర్లు, కొబ్బరి బొండాలు, పాత పనికి రాణి ఇనుప డబ్బాలు వంటివాటిని ఎప్పటి కప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.ఆరోగ్య కార్యకర్త శరత్‌బాబు, ఆరోగ్య సిబ్బంది నగీన,సుస్మలత, రామంజనమ్మ పాల్గొన్నారు.

## డయేరియాపై అవగాహన కార్యక్రమం

**విశాలాంధ్ర-గోరంట్ల:** గోరంట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గోరంట్ల మూడవ సచివాలయ పరిధిలోని ఆరోగ్య సిబ్బంది డయేరియా మరియు సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని బీసీ హాస్టల్ నందు విద్యార్థులకు సిబ్బందికి డయేరియా అతిసార మరియు సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వాసు, ఎమ్ఎల్ హెచ్‌పి చైత్ర తో పాటు ఆరోగ్య సిబ్బంది విజయభాస్కర్, శాంత మరియు 104 సిబ్బంది జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణి

**విశాలాంధ్ర-ముదిగుబ్బ :** మండల పరిధిలోని రామస్వామి తండా ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం టిడిపి హిందూపురం పార్లమెంట్ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ హేమలత బాయ్ విద్యార్థులకు విద్యా సామాగ్రి నోటు పుస్తకాలు, పెన్సిల్లు, ఇతర విద్యా సామాగ్రి పంపిణీ చేశారు. అనంతరం పాఠశాలలో కుళాయిలు, గ్యాస్ సిలిండర్, గ్యాస్ స్టవ్ ను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ రమణప్ప, టీడీపీ మండల క్లస్టర్ ఇంచార్జ్ తుమ్మల మనోహర్ లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు ఈ సందర్భంగా క్లస్టరించారు తుమ్మల మనోహర్ మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యా విధానంలో కొత్త మార్పులు తీసుకు వస్తారని, పేద విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వేస్తారని, రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్, ధర్మవరం టిడిపి ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ లు అభిమానులు కలవడానికి వచ్చినప్పుడు బొకేలు, పూలమాలలు ,శాలువాలు తీసుకురాకుండా నోట్ బుక్కులు, విద్యా సామాగ్రి తీసుకువస్తే విద్యార్థులకు ఉపయోగపడతాయని తెలిపారని, ఆస్ఫూర్తితోనే హేమలత విద్యా సామాగ్రి పంపిణీ చేస్తుండడం సంతోషదాయకమని, సామాజిక సేవా కార్యక్రమాలు చేయడంలో టిడిపి కార్యకర్తలు ముందు ఉంటారని, చదువే విద్యార్థి భవిష్యత్తును మారుస్తుందని, ప్రతి ఒక్కరూ శ్రద్ధగా చదువుకొవాలని, ప్రతి ఒక్కరూ హేమలతను ఆదర్శంగా తీసుకుని భవిష్యత్తులో సామాజిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం హేమలతను ఎంఈఓ, క్లస్టర్ ఇంచార్జ్ శాలువాకప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వెంకటేష్ నాయక్, తులసి బాయ్ టిడిపి నాయకులు గోనుగుంట్ల రామంజి, గద్దం మోహన్, నంద, కొలసాని చంద్ర, గోపాల్,అబ్దుల్లా, ఫిరోజ్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# సెల్ఫ్ లోడింగ్ కాంక్రీట్ మిక్సర్ వాహనాన్ని సద్వినియోగం చేసుకోండి

**విశాలాంధ్ర-అనంతపురం:** స్టాండప్ ఇండియా పథకం కింద అందించిన సెల్ఫ్ లోడింగ్ కాంక్రీట్ మిక్సర్ వాహనాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ పేర్కొన్నారు. బుధవారం అనంతపురం కలెక్టరేట్లో స్టాండప్ ఇండియా పథకం కింద మంజూరైన రాజమ్మ ఎంటర్ప్రైజ్ మరియు సర్వీసెస్ యజమానురాలు రాజమ్మకి సెల్ఫ్ లోడింగ్ కాంక్రీట్ మిక్సర్ వాహనాన్ని జిల్లా కలెక్టర్ అందచేశారు. ఈ వాహనానికి కెనరా బ్యాంకు, ఎస్ ఎం ఈ బ్రాంచు, అనంతపురము వారు ఋణాన్ని స్టాండప్ ఇండియా పథకం క్రింద మంజూరు చేశారు. ప్రాజెక్టు విలువ రూ.48.00 లక్షలకుగాను కెనరా బ్యాంకు వారు రూ.36.00 లక్షలు ఋణాన్ని ఇవ్వడము జరిగింది. ఈ వాహనమునకు ఇండస్ట్రియల్ పాలసీ 2023-27 పాలసీ లో 45 శాతం సుమారు రూ. 21.00 లక్షలు పెట్టుబడి రాయితీని జిల్లా కలెక్టరు గారి ఆధ్వర్యములో జరిగే డి ఐ ఈ పి సి సమావేశములో మంజూరు చేయడం జరుగుతుంది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... స్టాండప్ ఇండియా పథకం కింద జిల్లాలోని ప్రతి బ్యాంకు బ్రాంచు వారు కనీసం ఇద్దరికీ (ఒక ఎస్ సి / ఎస్ టి ం ఒక మహిళ) ఖచ్చితముగా ఈ ఆర్థిక సంవత్సరములో రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎల్డిఎంని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి జి. నాగరాజారావు, ఇండియన్ నర్సింగ్ రావు, బ్యాంక్ మేనేజర్ రాహుల్, మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## మెరుగైన సేవలు అందిద్దాం-ఎంపీడీవో సుబ్బరాజు

**విశాలాంధ్ర-ఉరవకొండ :** ప్రజలకు అందుబాటులో ఉండి వేగవంతంగా మెరుగైన సేవలు అందిద్దామని ఉరవకొండ ఎంపీడీవో సుబ్బరాజు పేర్కొన్నారు. బుధవారం ఉరవకొండ ఎంపిడివో కార్యాలయంలో పంచాయతి కార్యదర్శులకు సచివాలయ పరిధిలో అందించే సేవలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రజలతో మమేకమై పనితీరును మెరుగుపరచుకోవాలన్నారు. సచివాలయ సిబ్బంది బయో మెట్రిక్ అటెండెన్స్ లను ఉదయం 10 గంటలకు ఖచ్చితంగా వేయలని సూచించారు. అన్ని గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్స్ ప్రతిరోజూ 10 ఈ-సర్వీసెస్ లను చేయలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య కార్యక్రమాలపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. త్రాగు నీటి సమస్యలు రాకుండా సమస్యను గుర్తించి వెంటనే చర్యలు చేపట్టలని ఎంపిడివో సూచించారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి చంద్ర మౌళి,పంచాయతి కార్యదర్శులు గౌస్ సాహెబ్, భాషా, నాగభూషణ, శ్రీరాములు,రమణ కుమార్, ఆషీర్‌బాబు, రాఘవేంద్ర, మహేష్, గౌతమి, హనుమంతురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

**విశాలాంధ్ర-తాడిమర్రి:** మండల పరిధిలోని ఏకపాదం పల్లి గ్రామానికి చెందిన చంద్రయ్య (48) తన ఇంటి వద్ద నీటి కులాయి నుండి నీళ్లు పట్టడం కోసం కరెంటు మోటార్ సహాయంతో నీళ్ల పడుతూ ఉండగా ప్రమాదవశాత్తు కరెంటు షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన చూసిన కుటుంబ సభ్యులు వెంటనే కరెంటును ఆఫ్ చేశారు. అప్పటికే చంద్రయ్య మృతి చెందాడు. మృతుడు వ్యవసాయం చేసుకుంటూ తన కుటుంబాన్ని పోషించేవాడు.కుటుంబం యొక్క పనిమీద పని చేస్తూ హఠాత్తుగా చనిపోవడం పట్ల కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. మృతునికి భార్య లక్ష్మీదేవి ఒక కుమారుడు ఒక కూతురు ఉన్నారు. తాడిమర్రి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## జాతీయస్థాయి అవార్డుల కోసం దరఖాస్తులు చేసుకోండి

**విశాలాంధ్ర-కొత్తచెరువు:** ప్రభుత్వం ఆదేశాల మేరకు శ్రీ సత్యసాయి జిల్లాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు జాతీయ స్థాయిలో అవార్డుల ఎంపిక కోసం ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని డీఈవో మీనాక్షి తెలిపారు. ఉపాధ్యాయులు 2024 సంవత్సరానికి గాను ఈ అవార్డుల ఎంపిక కోసం జూలై 15వ తేదీ లోపల ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన వెబ్సైట్ నందు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

## కిసాన్ మహిళా రైతులకు సజ్జలు పంపిణీ

**విశాలాంధ్ర-గుడిబండ:** మండల కేంద్రంలోని ఎఫ్పిఓ కార్యాలయంలో మహిళా రైతులకు సజ్జలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వెలుగు పీడీ నరసయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగ చేసుకుని, దేశం మొత్తం చిరుధాన్యాలకు ప్రాధాన్యతను ఇస్తున్న తరుణంలో సబ్సిడీ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సజ్జలు,రాగులు తీసుకున్న ప్రతి రైతు పంట పండించి మరలా ఎఫ్పిఓ ద్వారానే మార్కెటింగ్ చేసుకునేలా ఎదగాలని తెలియజేశారు. తదనంతరం వ్యవసాయ ఉత్పత్తిదారుల సమాఖ్యలో అగళి, అమరాపురం, గుడిబండ, మడకశిర, రొళ్ల, పరిగి, రొద్దం మండలాలలోని 60మంది మహిళా కిసాన్ రైతులకు 60 ఎకరాల్లో సాగు చేయుటకు 1.50కేజీ బరువు గల 98 పాకెట్లను వెలుగు ప్రాజెక్ట్ డైరెక్టర్ నరసయ్య చేతులమీదుగా రైతులకు పంపిణీ చేశారు. డిపియంయు సిబ్బంది వెంకటప్ప,ఏపియం ముత్యాలప్ప,ఎఫ్పిఓ సీసీదేవరాజు,ఎఫ్పిఓ సభ్యులు రామతమ్మన్న,ఎఫ్పిఓ సిబ్బంది తదితర రైతులు పాల్గొన్నారు.

## మిరప పంటకు వచ్చే సమస్యలపై అవగాహన

**విశాలాంధ్ర-ఉరవకొండ:** ఉరవకొండ డివిజన్ ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో బుధవారం డిజిటల్ గ్రీన్ తరుపున మిరప పంటలో వచ్చే సమస్యలపై జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఫిరోజ్ ఖాన్ ఆర్.బి.కె. సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐవిఆర్ఎస్ ద్వారా మిరప పంట లో వచ్చు అన్ని రకాల సమస్యలకు రైతులకు ఫోన్ ద్వారా మెసేజ్ రావడం జరుగుతోందన్నారు. పురుగులు తెగు ళ్ల మరియు మార్కెటింగ్ గురించి ఆర్ బి కే అసిస్టెంట్స్‌కి ఆయన అవగాహన కల్పించారు. వ్యవసాయ సహాయ సంచాలకులు పద్మజ, ఉద్యాన అధికారి నెట్టి కంటయ్య, డిజిటల్ గ్రీన్( ఎన్జీవో) యశోద ఆర్ బి కే సిబ్బంది పాల్గొన్నారు.

## పత్తి రైతులకు సూచనలు సలహాలు

**విశాలాంధ్ర-రొద్దం:** మండల పరిధి పెదమంతుడు గ్రామ పొలంలో బుధవారం పత్తి పంటలను పరిశీలించి ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ డా.జాన్సన్, శాస్త్రవేత్త రామసుబ్బయ్య, పెనుగొండ వ్యవసాయ సహాయ సంచాలకులు స్వయంప్రభ, వ్యవసాయ అధికారి యోగేష్ పంటను పరిశీలించి పత్తి పంట 60 నుండి 90 రోజులు వ్యవధిలో ఉన్నదని, ఈ దశలో పంటకు 35 కేజీల యూరియా 15 కిలోల ఫొటోస్ ఎకరానికి వేసుకోవాలని సూచించారు.

## మొక్కలు నాటిన ప్రజా పరిషత్ కార్యాలనిర్వహణ అధికారి

**విశాలాంధ్ర-డి.హీరేహాళ్:** అనంతపురం జిల్లా ప్రజా పరిషత్ కార్య నిర్వహణ అధికారిణి నదియాదేవి డిహీరేహాల్ గ్రామంను సందర్శించి కస్తూరిబా పాఠశాలలో బాల్య వివాహాలు నిరోధించు విషయమై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరంమండల ప్రజా పరిషత్ కార్యా లయం ఆవరణలో మొక్కలు నాటు కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం కార్యాలయాన్ని సందర్శించి అధికారులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జి.రఘునాథ్, తాహసిల్దార్ బాల ఈశ్వర్ రెడ్డి, ఎస్సై ప్రసాద్ రెడ్డి, సిడిపిఓ ఎం. ప్రభావతి, ఏవో ఏవో బలరామారావు, నాగభూషణం, పంచాయతీ కార్యదర్శులు కృష్ణయ్య, నాగరాజు, రాజు, వెలుగు సిబ్బంది, కస్తూరిబా పాఠశాల సిబ్బంది, జూనియర్ అసిస్టెంట్ మహేష్, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ జిల్లా బాలల పరిరక్షణ సమితి పాల్గొన్నారు.

## డయేరియా సమన్వయంతో నివారిద్దాం

**విశాలాంధ్ర-రాప్తాడు:** డయేరియా వ్యాధి రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుని నివారణకు సమన్వయంతో కృషి చేద్దామని డా.శివకృష్ణ సూచించారు. రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో చేతులు పరిశుభ్రతగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు.విరేచనాలు కాకుండా తీసుకోవాల్సిన సలహాలను సూచించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్టాప్ డయేరియా కార్యక్రమం ఈనెలాఖరు వరకు జరుగుతుందన్నారు. నీరుకాచి, చల్లార్చుకుని తాగాలని పిల్లలకు చెప్పారు. డయేరియా అనేది కలుషితమైన ఆహారం, నీరు తీసుకోవడం వల్ల వస్తుందన్నారు. ఈ వ్యాధి సోకితే అధిక నీళ్ల విరేచనాలతో మనిషి నిరసించిపోతాడన్నారు. ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు ప్రతిఇంటికి వెళ్లి ఐదేళ్ల లోపు పిల్లలను గుర్తించి ఓఆర్ఎస్ ప్యాకెట్స్, జింక్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. పంచాయతీ సిబ్బందితో కలిసి త్రాగునీటి సరఫరాలో అనగా వాటర్ ట్యాంకుల నుంచి నీటిని కలుషితం కాకుండా క్లోరినేషన్ చేయించాలన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఓ శివప్రసాద్, ఇన్చార్జి హెచ్ఎం సాంబశివుడు, అంగన్వాడి టీచర్ ముత్యాలమ్మ, ఏఎన్ఎం లీలావతి, ఆశా కార్యకర్తలు చంద్రకళ, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రికి వెళ్లి పెన్షన్ అందజేత

**విశాలాంధ్ర-డి.హీరేహాళ్:** అనారోగ్యంతో బాధపడుతూ కర్ణాటకలోని బళ్లారిలో ఉన్న ఓపిడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శివకుమార్‌కు సోమలాపురం ఎంపిటిసి మొండి మల్లికార్జున, కురుబ శంకర్, సచివాలయ ఉద్యోగులు ఆసుపత్రికి చేరుకొని ఎన్‌టిఆర్ భరోసా ఫించన్‌ను అందించారు. శివకుమార్ ఆనందం వ్యక్తం చేసి ఫించన్ అందించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఆలయ నిర్మాణానికి విరాళాలు

**విశాలాంధ్ర-హిందూపురం :** పట్టణంలోని ఐదు లాంతర్ల సర్కిల్ గాంధీ చౌక్ ఎదురుగా నిర్మించనున్న శ్రీ లక్ష్మీనర సింహస్వామి దేవాలయం నిర్మాణానికి బుధవారం బృహద్దశ ఆరంభమైంది. దేవాలయం నిర్మాణ కమిటీ ప్రతినిధులు వ్యక్తిగతంగా ఒక్కొక్కరు రూ.2,01,116 చొప్పున 8 మంది రూ.16,08,928 ఆలయ ఖజానాకు డిపాజిట్ రూపంలో విరాళం అందచేశారు. దేవాలయం గౌరవాధ్యక్షులు జేఈ. వెంకటస్వామి, అధ్యక్షులు రాఘవేంద్ర, ఉపాధ్యక్షులు అంబికా రఘునాథ్, కార్యదర్శి నిమ్మకాయల రాము, డైరెక్టర్లు చంద్రమోహన్ యాదవ్, నెట్టప్ప, ఎస్ఎస్ అమర్నాథ్, ఆకుల సూర్యనారాయణ విరాళాలిచ్చారు. వారు మాట్లాడుతూ అతిత్వరలో ఆలయనిర్మాణ పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. దాదాపు రూ.6 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఆలయం నిర్మాణం కోసం భక్తులు విరివిగా విరాళాలు అందించాలని వారు పిలుపునిచ్చారు.

## బాలుర వసతి గృహంలో మౌలిక వసతులు కల్పించాలి

**విశాలాంధ్ర-రాప్తాడు:** ప్రభుత్వ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ బాలుర వసతి గృహంలో అన్ని మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం రాప్తాడు మండలం హంపాపురం గ్రామంలో ఉన్న ప్రభుత్వ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ బాలుర వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వసతి గృహంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అవసరమైన అన్ని మరమ్మత్తు పనులు చేపట్టాలన్నారు. వసతి గృహంలో గార్డెన్ అభివృద్ధి చేయాలని, మొక్కలు, చెట్ల పెంపకం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ డిడి కుష్బూ కొఠారి, హాస్టల్ వార్డన్ మారుతీప్రసాద్, గ్రామస్తులు వెంకటనారాయణ, ఆదిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.